ఇండియా టుడే - జూన్ 21 - 5జూలై, 1997

# హాస్తకళ!

మా అన్నయ్య రాజారావు ఉద్యోగరీత్యా ముప్ఫై ఏళ్ళబట్టి విజయవాడలో ఉంటున్నాడు. ఆయన మా పెదనాన్న కొడుకు. వాళ్ళ ఒక్కగానొక్క అమ్మాయి వసంత పెళ్ళి కుదిరిందనీ, వారం ముందుగా వచ్చి తనకి సహాయసహకారాలు అందివ్వమనీ ఉత్తరం రాశాడు. మాది పెద్ద బలగం. మేం అందరం నడుములు బిగిస్తే ఎంతతక్కువ టైములోనయినా సరే పెళ్ళిళ్ళు అవలీలగా చేసి పారేయగలం. అయినా, ఈరోజుల్లో ఆడపిల్ల తరుపు వాళ్లు పూర్వంలా నడుములు విరక్కొట్టుకుని హైరానా పడవల్సిన అవసరం చాలామటుకు తప్పిపోయింది. అన్నిటా అధునాతనత్వం వచ్చింది. 'మా ఇంట్లో పెళ్లి ఫలానా తారీఖున, ఇన్ని గంటలకు, ఈ పన్లు కాంట్రాక్టుకు ఇవ్వదల్చుకున్నాం' అంటే చాలామంది ఆర్గనైజర్స్ 'మేం అంటే మేం' అని ముందుకు వస్తున్నారు. మంగళసూత్రాలు మినహా మనమేమీ అమర్చుకోనవసరం లేదు. మామిడాకులు, పెళ్ళిమండపం, తలంబ్రాల బియ్యం, కాడి - ఏవీ చూసుకోనక్కర్లేదు. ఏయే కూరలు, ఏయే పచ్చళ్ళు, ఏ స్వీట్స్ చేయాలో చెప్పి ఊరకుంటే చాలు. అన్నీ వాళ్ళే చూసుకుంటారు. ఎవరు కట్టుకున్న బట్టలూ నలగవు. పట్టుచీరలు పాడవుతాయేమోననే భయం లేదు. వియ్యంకుడు, వియ్యపురాలు, ఆడబడుచులు, ఆఖరికి పెళ్ళికొడుకును కూడా కాంట్రాక్టరే సంబాళించు కుంటాడు. కల్యాణ మండపానికి ఒక పక్క ఆడపెళ్ళివారు, మరో పెడ మగపెళ్ళివారు కూర్చుని వీడియో వాడి కళ్ళపడితే చాలు, తనివి తీరని ఆనందం - తరతరాలు గుర్తుగా క్యాసెట్‌లో నిక్షిప్తం అయి చేతికి వస్తుంది.

నేను విజయవాడ వెళ్ళి, కాస్తంత సేద దీర్చుకుని ఆ తర్వాత అన్నయ్యతో నాకు రైల్లో వచ్చిన ఆలోచనలు చెప్పాను. "తరతరాల నుంచీ ఆచారంగా వస్తున్న అయిదు రోజుల పెళ్ళిని సుమారు యాభై సంవత్సరాల క్రితం మన మధ్యతరగతి మహానుభావుడెవరో ధైర్యంగా ఒకరోజు పెళ్ళిగా కుదించి ఉంటాడు. ఈవేళ అదీ భరించలేని సాదా సీదా ఉద్యోగి దాన్ని అయిదు గంటలకు మినిమైజ్ చేసి, అసాధ్యమేమీ లేదు అంటూ నిరూపిస్తున్నాడు. ఈవేళ పెళ్ళిళ్ళలో సంప్రదాయం కన్నా సోషలిజమే ఎక్కువ కన్పిస్తోంది" అన్నాను నేను.

రాజారావు అన్నయ్య నవ్వుతూ 'నిజమేరా' అన్నాడు.

"మరిది చెప్పింది నిజమే. ఓ గంట పెళ్ళి... రెండు గంటలు భోజనాలు... ఓ గంట మిగతా తంతు. ఆ తర్వాత ఎవరి దారి వారిది. ఆడపెళ్ళివారూ, మగపెళ్ళివారూ అదనీ ఇదనీ కుస్తీలు పట్టుకునే అవకాశమే ఉండదు." కామేశ్వరీ వదిన అంది.

"చూడమ్మా వదినా.... ఒక్క బ్రాహ్మణ ఇళ్ళల్లో పెళ్ళిళ్ళప్పుడే అటూ ఇటూ వాళ్ళు భేషజాలు పోయేది, అల్లర్లు పెట్టుకునేది. నేను ఇతర కులాల వాళ్ళవి వందల పెళ్ళిళ్ళు చూశాను. రెండు వైపుల వాళ్ళు ఎంతో ఆప్యాయంగా పనుల్లో భుజాలు కలుపుతారు. నిజానికి మనిళ్ళల్లోనే అతి ఎక్కువ..."

"మన ఆచారాలు అలా తగలడ్డాయి, మా అక్క పెళ్ళిలో మగపెళ్ళివారు ఇల్లు పీకి మరో పందిరి వేశారనుకో. వియ్యంకుడి గారి దూరం చుట్టాన్ని 'భోజనానికి లేవండి' అని పిలవనందుకు ఈ రోజుకూ అది తిట్లు తింటూనే ఉంది."

నేనూ, అన్నయ్యా నవ్వేశాం. అన్నయ్య పెళ్ళి పన్లు కాంట్రాక్టుకు ఇస్తే ఎంత ఖర్చవుతుందో లేక ఆ పని సొంతంగా చేపడితే ఎంత మిగుల్తుందో లెక్కలు కడుతున్నాడు. ఇంతలో లోపలి నుంచి వసంత వచ్చింది. ఆమె వెనుక ఇద్దరు అమ్మాయిలూ వచ్చారు. వసంత నన్ను పలకరించి తన స్నేహితురాళ్ళను వనజగా, సీతగా పరిచయం చేసింది. నాకు వాళ్ళు నమస్కారాలు చేశారు.

"అంకుల్, మా వసంత చీర్లకు ఎంత బడ్జెట్ కేటాయించారో చెప్పండి" అంది వనజ.

"రెండు పట్టుచీరలకు మూడువేలు. రెండు మామూలు చీర్లకు వెయ్యి రూపాయిలు." వదిన అంది.

"అన్యాయం, చాలా తక్కువ ఆంటీ" అంది వనజ.

నేను వనజ వైపు చూశాను. ఆమె వసంతకన్నా, సీతకన్నా పెద్దదానిలా కనిపించింది. ఆమె ఎత్తరి, ఎత్తుకు తగ్గ శరీరసౌష్ఠవం. ఆమె నాకు ఇష్టమైన లేత నీలం రంగు వాయిల్ చీర – తెల్ల బోర్డరు మీద హంసలులన్నవి కట్టుకుంది. అది పమిట రూపంలో ఆమె గుండెల మీద ఒక ఎత్తయిన వంపు తీసుకుని, వాగులా సాఫీగా మారి, తిరిగి భుజం మీదకు దారి మళ్ళించుకుని, ఆఖరిగా పయటంచుతో పిరుదుల వరకూ మడతలుగా వెళ్ళింది. మాట్లాడుతూ ఆమె కుడిచేయి వెనక్కి సుతారంగా ఎత్తి పమిటను కుడిభుజం మీదకు మార్చుకునే విన్యాసం చేయడం, అది మాట వినక జారుతూనే ఉండడం వింతగా, ఆశ్చర్యజనితంగా, అద్భుతంగా కనిపిస్తోంది.

ఆమె నడుము దగ్గర ఆచ్ఛాదన లేని మూలంగా శరీరం తన ఛాయ బంగారపు రంగుకు కాస్త అటూ ఇటూగా ఉంటుందని చెప్తోంది. సన్నని నడుమును స్పృశించలేని చీరకట్టు నిరాశపడీ, కొంచెం అలిగీ, ఆ కోపాన్ని పిరుదుల చుట్టూ అందంగా చుట్టేసుకుని సంతృప్తిపడి, ఆపైన పరికిణీ రంగుతో జమిలిగా కలిసిపోయింది. తుదిగా సేదదీర్చు కుందుకు కుచ్చెళ్ళుగా మారి తన అంచులమీద తెల్ల హంసలతో ఆమెకు పాదాభివందనం చేసే తీరు చూస్తుంటే అత్యద్భుతంగా అనిపించింది. దాంతోనే నా గుండె తన ఉనకిని ఉండుండి నాకు గుర్తు చేయడం మొదలుపెట్టింది. ఆశ్చర్యం – చీర కదలికలు కూడా కొత్త కొత్త స్వరాలు సృష్టించగలవని నాకు అప్పుడే తెలిసింది.

"బాబయ్యా, వనజ ఆర్కియాలజిస్ట్ డిగ్రీ చేసింది. పూనాలో పనిచేస్తుంది. దీని పని పురాతన కట్టడాలు చుట్టూ తిరగడం. భూమి పొరల్లోని మట్టీ మశానం కలెక్ట్ చేసి పరీక్షలు నిర్వహించడం. ఆఖరికి ఇసుకమీద కూడా రీసెర్చ్ చేస్తూనే ఉంటారు వీళ్ళు."

"మన దొడ్డిలో మట్టి పట్టుకుపోయి, ఈప్రాంతాల్లో హరప్పా, మొహంజదారో నాగరికత ప్రభావం ఏమైనా వుందో లేదో టక్కున తేల్చేయగలదు." సీత అంది.

"నిజమాండీ" అన్నాను నేను.

"అదేం కష్టం కాదనుకోండి. ఇందులో పెట్రొలాజికల్ టెస్ట్‌లనీ, పేలియో మేగ్నటిక్ డేటింగ్ టెస్టులనీ రకరకాల విధానాలు ఉన్నాయి. రాజస్థాన్‌లో ఇసుక మేటల వయసు ఒక లక్షా అరవై ఆరువేల సంవత్సరాల నాటివని తేలింది. మా వాళ్ళు అలా ముందుకు పోతూనే ఉంటారు."

"మీది గొప్ప చదువు. లోతులకు తీసుకువెళ్ళే విజ్ఞానం అనాలి దాన్ని. మావన్నీ పైపైవి" అన్నాను.

"వస్తాం, బాబయ్యా" అంది వసంత. వనజా, సీతా ఆమె వెనుకే వెళ్ళారు. ఓ అరగంటపాటు నేనూ, అన్నయ్యా, వదినా వియ్యాలవారికి కొన్న బట్టల ఖర్చు, చేయించిన బంగారపు నగలూ వాటి ధరలూ, చేయవల్సిన పన్లూ ఇత్యాదులు మాట్లాడుకున్నాం. అన్నయ్య ఉన్నట్టుండి తన హేండ్‌బేగ్ తెరిచి అందులో ఉన్న చిన్న డైరీ తీసి నా చేతికి ఇచ్చాడు.

"శుభలేఖలు ఇంకా వీళ్ళకు పంపలేదు. పేర్లు చెబుతాను, రాయి"

నేను ఒక్కొక్కరి పేరూ, అడ్రసూ రాస్తున్నాను.

ఇంతలో వనజ నేలచూపులు చూస్తూ ఏదో వెదుక్కుంటూ మా వైపు వచ్చింది.

"ఏమిటమ్మా వెదుక్కుంటున్నావ్?" వదిన అడిగింది.

"నా చెవి జూకా ఒకటి పడిపోయిందండి. ఎక్కడో..."

నేను వనజవైపు చూశాను. ఒంటి జూకాతో వనజ అదోలా కొత్తగా కనిపిస్తోంది. సరిగ్గా చెప్పాలంటే ఆమె మొహం మబ్బు సగం కప్పిన సూర్యబింబంలా ఉంది. ఆమె అలా మూల మూలలు చూస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"ఈ కాలం పిల్లలందరూ ఇంతే. కాళ్ళల్లో చక్రాలు పెట్టుకున్నట్టు నడుస్తారు." వదిన నవ్వుతూ అంది.

"ఈ కాలం తీరు అలా ఉంది. అయినా, మీ వదిన పెళ్ళి అయిన కొత్తలో నేలమీద నడిచేదేమిటి? వంటింట్లోంచి మా అమ్మ పిలిస్తే చాలు, పి.టీ. ఉషలా ఒక్క గెంతులో పడగ్గది వదిలి ఆమె ముందు వాలేది."

"మీ అమ్మ గొంతుకే అంత. పైగా ఆవిడ సక్కుబాయి అత్తగారికి అనుంగు చెల్లెలాయె. ఏం చెయ్యాలి మరి?"

"తమ్ముడూ, అత్తగారిని తిట్టిపోయని కోడళ్ళు ఈ దేశంలో ఒక్కరంటూ ఉంటారంటావా?"

"ఆ మాటేమోగాని, కోడల్ని కన్న కూతురిగా చూసుకున్న మంచి అత్తగారి కథ ఒక్కటంటే ఒక్కటి విన్పిద్దురూ గొప్పలు పోక" అంది వదిన సవాల్‌గా.

"ఏమే కామేశ్వరీ ఇక్కడ ఉన్నావా? మీరూ ఇక్కడే ఉన్నారా" అంటూ మా పెద్ద మామయ్య భార్య పద్మావతి లోపలికి వచ్చింది. ఆమె చేతిలో పెద్ద సైజు ఇంపోర్టెడ్ హేండ్‌బేగ్ ఉంది. దాన్ని కుర్చీలో పడేసి, జేబురుమాలుతో మొహం తుడుచుకుని మా పక్కన చతికిలబడింది.

"మా కజిన్ సిస్టర్ పెళ్ళి ఉంది ఈ రాత్రికి. ఎల్లుండి ఉదయం మా అత్తయ్య కొడుకిది. రాక తప్పింది కాదు."

"బావుంది పిన్నీ. నీకు అటూ ఇటూ తిరగడాలు తప్పాయి."

"మామయ్య ఎప్పుడు వస్తానన్నాడు?"

"ఆయన సంగతే అడుగు. బుద్ధ విగ్రహంలా ఓ పట్టాన కదలరు. అన్ని పెళ్ళిళ్ళకు నేనే హాజరవ్వాలి. మధ్యన నేను నలిగిపోతున్నాను" అంది అత్తయ్య.

నేను అత్తయ్య వైపు చూశాను. ఖరీదయిన కంచి పట్టుచీర కట్టుకుంది. మెడనిండా రక రకాల గొలుసులు. ఒక్కొక్క చేతికీ డజనేసి గాజులు. కుడిచేతి అయిదు వేళ్ళకూ, ఏ ఒక్కదానికీ అపకారం జరగకూడదన్నట్టుగా అయిదు ఉంగరాలు. పద్మావతి అత్తయ్య అప్పుడే ఏడు వారాల నగలు ధరించి, విష్ణులోకం నుంచి ఎకాయెకిన భూలోకానికి దిగివచ్చిన లక్ష్మీదేవిలా కనిపించింది.

"అది సరే అత్తయ్యా, రోజులు బాగోలేవు. ఇంత చేటు బంగారం వేసుకుని ఒక్కత్తివీ రావడానికి భయం వేయలేదా" అన్నాను.

"నిజమే అనుకో. కానీ, పెళ్ళిళ్ళకు వస్తూ బోసి మెడతో వస్తే నలుగురిలో బావుండదు కదా. పైగా, నగలు చేయించే మీ మామయ్య ఉండగా నాకేం భయం లేదులే."

"జాగ్రత్తమ్మా పిన్నీ, ఎక్కడా మర్చి ఏ నగా పెట్టొద్దు. అందరూ కావల్సినవాళ్ళే. తరువాత అనుకుని లాభం ఉండదు."

"నాకు తెలియకనా, పమిట నిండుగా కప్పుకుంటాలే" అని ఆగి – "అయినా, నా ఒంటిమీద చేయి వేయిగల వాడు ఇంకా పుట్టి ఉండడు" అని నవ్వేస్తూ పద్మావతి అత్తయ్య నావైపు చూసి, అదోలా మొహం పెట్టి, "అవును సుబ్బారావు, నువ్వెప్పుడు పెళ్ళి చేసుకుంటావ్? మన వాళ్ళలో నువ్వే మిగిలిపోయావ్, పిల్లని చూద్దునా" అంది.

"అమ్మాయిల వేటలోనే ఉన్నాను..."

"మిలట్రీలో పని చేస్తున్న వాడివి. నీకు గురి తప్పడం అంటూ ఉండకూడదే? ఎందుకు జరుగుతోంది జాప్యం?"

"నీ దృష్టిలో ఎవరైనా ఉన్నారేమిట్రా, ఉంటే చెప్పు భయంలేదు." అన్నయ్య అడిగాడు నవ్వుతూ. నేనూ నవ్వేశాను అంతే.

"నవ్వు జవాబు అవదోయ్ మరిదీ. అదో ముద్ర మాత్రమే" వదిన అంది. ఆపైన అందరం లేచాం.

❖ ❖ ❖

ఒక్కొక్కళ్ళే బయటకు వెడతున్నారు. ఆఖర్ని పద్మావతి అత్తయ్య నెమ్మదిగా నడుస్తోంది. ఆమె నడకలో వింతదనం, కొత్తదనం ఉన్నాయి. ఆమె కళ్ళకు నిశితంగా పరీక్షించగల గుణం ఉంది. బంగారు గాజులు పెట్టుకున్న ఆమె చేతులు కదలికలో ఖరీదయిన ఉంగరాలు తొడిగిన ఆమె గుండ్రని మొనతేరిన వేళ్ళు, చూడ ముచ్చటగా, బంగారు పిడిలో దాగిన చిన్నపాటి గుండ్రని చాకుల్లా ఉన్నాయి. నేను పద్మావతి అత్తయ్య వెనుకే నడుస్తున్నాను. ఆమె వెళ్ళి హాల్లో అయిన వాళ్ళ మధ్య చతికిలబడింది. ఒక్కొక్కళ్ళనూ ఆవిడ నవ్వుతూ పలకరిస్తూ, కళ్ళతో పరికిస్తూ వేళాకోళాలాడుతుంటే, ఆమె ఆ చిన్న సభాస్థలిలో ప్రముఖ వక్తలా అనిపిస్తోంది. పద్మావతి అత్తయ్యకు బోల్డు ఆస్తి ఉంది. నాలుగైదు ఇళ్ళు ఉన్నాయి. ప్రాణంగా చూసుకునే మామయ్య ఉన్నాడు. ఇద్దరికీ పిలవకుండానే కొండమీద కోతుల్ని దిగి వచ్చేటట్టు చేయగల తెలివితేటలు ఉన్నాయి. డాక్టరీ, ఇంజనీరింగ్ చదివి కుప్పతెప్పలుగా కట్నాలు నొల్లుకు రాగల దీపాల్లాంటి ఇద్దరు కొడుకులున్నారు. అందుకే అత్తయ్య చాలాసార్లు, 'నాకేం లోటు లేదు' అంటూ ఉంటుంది ధీమాగా. నిజమే! కానీ, పద్మావతీ అత్తయ్యలో ఓ లోపం ఉంది. అది భగవంతుడు పెట్టిన లోపమో లేదా ఆమె స్వయంకృతాపరాధమో నాకింతవరకూ తెలయలేదు. అందుకే మేం అందరం పద్మావతి అత్తయ్యను చూసి భయపడతాం. ఆమె మాకు కావల్సిన మనిషి. దగ్గిర బంధువు, నలభై ఏళ్ళ దాటిన ముత్తయిదువ. ఆమె మొహం మీద ఏమీ అనలేక, గట్టిగా పైకి మాట్లాడుకోనూ లేక మేం ఊరుకుంటాం.

❖ ❖ ❖

శ్రీనివాసా ఫంక్షన్ హాల్లో వసంత పెళ్ళి జరిగింది. ఒక విధమైన ఆనందం, ఉత్సాహం, ఆత్మీయత కొన్ని గంటలపాటు అక్కడ మూకుమ్మడిగా చేతులు కలిపాయి. పెద్దవాళ్ళు పట్టుచీరలు ధరించి, నగల బరువు దానికి తోడవడంతో బరువు బరువుగా నడవడం, పెళ్ళి కాని అమ్మాయిలు యౌవనోత్సాహానికి నూతనోత్సాహాన్ని జతకలిపి, వాటికి కిలకిల నవ్వులు పై మెరుగులు దిద్దుతూ కళ్ళతో పూలబాణాలు విసరడం దాంతో వాళ్ళు దేవలోకంలోని అప్సరసలకు అనుంగు చెల్లెళ్ళో, పోటీదారులో, తెలియని స్థితి ఏర్పడడం, నయా ఫ్యాషన్లతో రేబాన్ కళ్ళజోళ్ళతో, సఫారీ సూట్లతో దేశ విదేశీ స్టార్ టీ.వీ. హీరోల్ని అనుకరిస్తూ చిన్నపాటి అల్లర్లను గుత్తకు తీసుకున్న యువకులు – తెలుగు, హిందీ, ఇంగ్లీషు లాంటి అనేక భాషల కలగూర గంపలు నోటికి ఎత్తుకోవడం, గతకాలపు

వైభవాలకు ప్రతీకలై పాతబడిన రాజప్రాసాదాల్లాంటి వెనుకటి తరం మనుషులు తడబాటు మాటలకు, నడకలకు నిలయాలవడం; అంతా వింతగా ఉంది. అప్పటికే అన్ని తంతులూ పూర్తి అయ్యాయి. బఫే డిన్నరు తిని చాలామంది ఆహ్వానితులు వెళ్ళిపోయారు. అప్పుడు పదకొండు గంటలు దాటింది.

అన్నయ్య వదినలవైపు చూశాను. వాళ్ళు అదోలా కనిపించారు. 'ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలి' అని అనుకోవడం వెనుక ఉన్న ఆదుర్దా, ఆందోళనా ఆ పెళ్ళి కాస్తా అయిన తర్వాత మాయమై, కన్నవాళ్ళ హృదయాల్లో వెల్తితో పాటు బెంగను కూడా నింపుతుందేమో! అప్పగింతల తంతులో రక్తసంబంధీకులందరూ కంట తడిపెట్టారు. కళ్ళు ఒత్తుకున్నారు. పద్మావతి అత్తయ్య అంతా చూసి, "ఆడపిల్లలుంటే అన్నీ బాధలే సుబ్బారావు చూశావుగా" అంది వేదాంత ధోరణిలో. ఇంతలో వ్రతం కార్యక్రమాలు పూర్తి చేసుకుని వసంత స్నేహితురాళ్ళతో వచ్చి మా మధ్య కూర్చుంది. వసంత తల నిమిరి వదిన, "ఏం అమ్మా నీర్సం వచ్చిందా? కళ్ళు చూడు, పొగకి ఎలా ఉబ్బి పోయాయో" అంది నొచ్చుకుంటూ.

"ఏం లేదమ్మా, నిద్ర వస్తోందంతే."

"వసంత అలిసిపోయింది ఆంటీ. మీలో ఇంతచేటు పూజలా. ఇవి ప్రార్థనలా, పరీక్షలా" అంది ఆశ్చర్యంగా వనజ.

"మన మతం ప్రతి ప్రార్థననీ పరీక్షగా తీసుకోమంటుంది. దాంతోనే మనలో దీక్షకు పునాది పుడుతుంది."

వనజ నవ్వింది.

"అవునూ, మొన్న మీ పోయిన జూకా దొరికిందా" అని అడిగాను నేను.

"లేదండీ."

వదిన ఓసారి ఆవులించి, "నిద్ర వస్తోంది. పడుకుందాం. మళ్ళీ తెల్లవారేసరికి ఇదొకటి ఖాళీ చేసి ఇవ్వాలి కదా" అంది.

"నాకూ నిద్ర ముంచుకొస్తుంది పడుకుంటాను" అంటూ పద్మావతి అత్తయ్య లేచి హాలు మూల ఆడవాళ్ళ పక్కన చేరింది.

"మీరూ పడుకోండే" అంది వసంత వనజనీ, సీతనీ చూసి.

"పెళ్ళికూతురుకు రేపంతా పనే. నిద్రపో తల్లీ, అలిసిపోయావ్," అంది సీత. వసంత సీత పక్కన జేరి ఆమె నడుం మీద ఓ చెయ్యివేసి, ఒకాలు ఆమె పిరుదు మీద వేసి, మరోచేయిని తలగడగా చేసుకుంది. సీత ఏదో అని వసంత వీపుమీద చరిచి, బుగ్గలు గిల్లింది.

"పోవే, ఎంతైనా నిన్ను మాఆయన అని ఎలా అనుకుంటాను" అంటూ నవ్వేసి, "ఇంక మాట్లాడకు" అని, అలాగే కూర్చున్న వనజని చూసి, "నువ్వూ పడుకో" అంది.

"ఇంకేం నిద్ర. నాకు పొడికళ్ళు పడ్డాయి."

అక్కడ నిద్ర రాని నేనూ, వనజా మిగిలిపోయాం. నేను ఆమెవైపు చూశానో, ఆమె నావైపు చూసిందో గాని, మా ఇద్దరి చూపులు ఒకటికి రెండుసార్లు నిశ్శబ్ధంలో కలిశాయి. గులాబీరంగు పట్టుచీర, ఆకుపచ్చ జాకెట్, పక్క పాపిడి తీసుకుని వదులుగా వేసుకున్న జడలో అలిసిపోయిన గులాబీలు, మొహంలో కూడా కాస్తంత నీర్సం. కోలమొహం వనజది. కుడి బుగ్గలో సొట్ట అతి చిన్న నవ్వుకే ప్రతిఫలిస్తోంది. చిన్న చాకులాంటి ముక్కు, చిన్న దొండపండు మీద లెటర్ 'ఎమ్'ని నుంచోపెట్టి నట్టున్న నోరు. నలుగురైదుగురు ప్రముఖ చిత్రాకారులు, శిల్పులు కూడబలుక్కుని ఆమె శరీర నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించినట్టుగా ఉంటుంది వనజ.

వనజ తన ఎడం చేతిలో కుడి చేత్తో రాస్తూ రాస్తూనూ, కాసేపటికి పువ్వులు సరిజేసుకుంటూనూ, మెడ అటూ ఇటూ తిప్పి కనబడని దృశ్యాలు చూస్తూనూ కాలక్షేపం చేస్తోంది. కాసేపు ఆగి, "మీరేం చేస్తున్నారు" అంది. ఆ ప్రశ్న నావైపు చూడకుండా అడిగింది. నాకు నవ్వొచ్చింది.

"వచ్చే నిద్రను ఆపుతూ, పైగా దాన్ని దూరంగా తరిమేస్తున్నాను."

"ఇప్పుడు కాదండీ, అసలు..." అంది. అతి చిన్న నవ్వు ఒకటి నవ్వి.

"ఓ అదా. ఎయిర్‌ఫోర్స్‌లో జె.సి.ఓ.గా ఉంటున్నాను"

"బావుంది"

"బావుందేమిటండీ, ఇదేం కాంప్లిమెంట్?"

వనజ మళ్ళీ నవ్వేసి, "మనతెలుగులో కొన్ని పదాల సృష్టి, వాటి వాడకం ఆశ్చర్యంగా ఉంటుంది. సందర్భాన్ని బట్టి వాటికి రకరకాల అర్థాలు చెప్పుకోవచ్చు."

దూరం నుంచి పద్మావతి అత్తయ్య, "సుబ్బారావూ, లైటార్పి పడుకోరాదా, వెలుతురు కళ్ళల్లో పడుతోంది" అంది.

"ఆవిడ ఇబ్బంది పడుతున్నారు."

"పోనీ, బయట షామియానాలో కూర్చుందాం."

"నాకు నిద్ర వస్తోన్నట్టుగా ఉంది."

"మంచిది."

"నిద్ర వస్తోందంటే, మంచిదంటారేమిటంటీ"

"ఇదీ తెలుగుమాటల నానార్థాల గూఢార్థాల శోభే."

వనజ కుర్చీలోంచి లేచి ఆడవాళ్ళు పడుకున్న వైపు వెళ్ళబోయింది.

"మీతో ఒక మాట మాట్లాడాలి."

"నాతోనా... ఇప్పుడు..."

ఇద్దరం బయటకు వెళ్ళాం. బయట షామియానాలో కుర్చీలన్నీ ఖాళీగా వున్నాయి. పనివాళ్ళు కొందరు రెండు మూడు కుర్చీలు జత చేసి వాటిలో నిద్రపోతున్నారు.

"మీరు తెల్లవారే వరకూ నిద్రపోకూడదు. మెలకువగా ఉండాలి."

"అంటే జాగరణా దేనికీ? ఈ వేళ పుణ్యదినం కూడా కాదే!" వనజ ఆశ్చర్యంగా చూసింది.

"నా గురించి..."

"మీ గురించి అంటే?"

"మీరు హాల్లో ఆ మూల, అదే మా పద్మావతి అత్తయ్య పక్కన వట్టినే పడుకోండి. చిలకాకు పచ్చరంగు నేత చీర కట్టుకుని, చేతికి వంకీ పెట్టుకుందీ, ఆవిడ..."

"ఏం ఆవిడకేమన్నా అనారోగ్యమా?"

"ఒక విధంగా దాన్ని అనారోగ్యమే అనాలి. ఆవిడకు చిన్న జబ్బు ఉంది."

"ఏం జబ్బు?"

నేను నెమ్మదిగా వనజకు పద్మావతి అత్తయ్య గురించి చెప్పాను. వనజ ఆశ్చర్యపోతూ అంతా విని, "అయితే, ఆవిడ క్లెప్టోమేనియాక్ అన్న మాట. అవునా" అంది.

"ఈ ఒక్క సహాయం చేయండి. మిమ్మల్ని జీవితాంతం, అదే చాలాకాలం గుర్తు పెట్టుకుంటాను."

"గుర్తే కదా. దానికేం పెట్టుబడి కావాలి కనుక. మీ కోరిక నేనెందుకు కాదనాలి, అదీ మంచి గురించే అయినప్పుడు సరే."

"గుర్తులు దాటి జ్ఞాపకం పెట్టుకోవల్సిన వాళ్ళు కొందరుంటారు కానీ..."

"కానీ, అని ఆగిపోయారేం? చెప్పండీ?"

"నేను చెప్పింది అవివాహితలకు అర్థం కావాలే" అన్నాను మొహమాటంగా.

"మగవాడెప్పుడూ స్త్రీ ముందు మనసు విప్పి మాట్లాడాలి. ఆ మాటలు విన్న ఆడది వాటిని మనసులో భద్రపరచుకోవాలి. అప్పుడే వాళ్ళిద్దరి మధ్య నడిచిన సంభాషణలకి పరిమళం అబ్బుతుంది".

"మీరు చాలా పొయిటిక్‌గా చెప్పారే విషయాన్ని"

"కవిత్వం చెప్పడానికి పెట్టుబడి అవసరం లేదుగా. ఊహాత్మకత ఉంటే చాలు."

"మాట మీదకు మరో అందమైన మాటతో ఢీకొట్టడం మీలో నేర్పు."

వనజ నవ్వి, "కితాబులు ఇవ్వడానికి కూడా ఖర్చు ఏం అవదులెండి" అని లేచి, "మరి నేను లోపలికి వెడతాను. మీరు ఒప్పగించిన కార్యం నిర్వహించాలిగా" అంటూ తన హేండ్ బేగ్ భుజాన తగిలించుకుంది. నేనూ లేచాను. వనజ లోపలికి వెళ్ళి పద్మావతి గారి పక్కన కూర్చుని, "ఇక్కడ పడుకోమంటారా. ఆంటీ... నేను వసంత స్నేహితురాల్ని పూనా నుంచి పెళ్ళికి వచ్చాను" అన్నది.

పద్మావతి కొంచెం జరిగి, "దానిదేముంది ఇలా పడుకో" అంది.

"ఆంటీ మీదే ఊరు?"

పద్మావతి తన గురించే కాక, తన వంశవృక్షం మొత్తం తెరిచింది...

"అదృష్టవంతులు."

"ఏం అదృష్టంలే,ఇంతకీ నీకు పెళ్లి అయినట్టేనా?"

"ఇంకా లేదు. చేసుకోవాలి" అంటూ వనజ తన కథ టూకీగా చెప్పింది.

ఆ తర్వాత తన బేగ్ తెరిచి, దేవుడి ఫొటో ఒకటి తీసి రెండు నిముషాలు మెడిటేషన్ చేసింది. కళ్ళు తెరిచింది. ఆ పైన కాగితంలోంచి ప్రసాదం లాంటిది తీసి నోట్లో వేసుకుని, "నిన్ననే తిరుపతి వెళ్ళి వచ్చాను. కాస్త ప్రసాదం నోట్లో వేసుకోండి" అంటూ పద్మావతికి మొరమొరాలు అందించింది. పద్మావతి చెయ్యి జాపి వనజిచ్చిన ప్రసాదం నోట్లో వేసుకుంది. నేను అన్నీ గమనిస్తూనే ఉన్నాను దూరం నుంచి. అప్పుడు హాలంతా నిశ్శబ్దం. చిన్నపాటి చీకటి. మనుషులు సర్వం మరిచి ఊపిరి మాత్రమే తీసే యంత్రాల్లా మారిపోయారు. ఎవరికీ ఏమీ తెలియదు. సర్వం తెలిసిన ఆత్మ గుండె వెనుక తన కార్యకలాపాలు మాత్రం సాగిస్తూనే ఉంటుంది. మనిషికే నిద్ర, మనసుకూ, ఆత్మకూ ఏవీ ఉండవు. అవి పరంజ్యోతికి ప్రతిబింబాలు. నాకు ఆవులింతలు వచ్చాయి. కళ్ళు మూతలు పడసాగాయి.

❖ ❖ ❖

తెల్లవారింది. నేను లేచి కళ్ళు నులుముకని హాలంతా చూశాను. అన్నయ్యనీ, వదిన్నీ లేపాను. మరోసారి హాలు కొనవైపు చూశాను. అక్కడ పడుకున్న ఒకళ్లిద్దరు ఆడవాళ్లు లేస్తున్నారు. నాకు ఆ పడుకున్న జనాభాలో వనజా, పద్మావతి అత్తయ్యా కనబడలేదు. లోపల గదుల్లో చూశాను. అక్కడా లేరు.

"పద్మావతి అత్తయ్యా, మన వసంత స్నేహితురాల వనజా ఏరీ" అని అడిగాను మా వదిన తల్లిగారిని.

"మీ అత్తయ్య సత్యనారాయణపురంలో ఎవరిదో పెళ్ళుందని అయిదు గంటలకే లేచి వెళ్ళింది నాయనా."

"అటుగా వసంత వచ్చింది. ఆమెను వనజ గురించి అడిగాను.

"అది ఉదయం ట్రెయిన్‌కు హైదరాబాద్ వెళ్ళిపోతానని చెప్పింది. తెల్లవారగట్ల నన్ను లేపి చెప్పడం ఎందుకనుకుందేమో"

నాకేం అనాలో తెలియడం లేదు. వనజ వెళ్ళిపోవడం, అదీ నాకు చెప్పకుండా వెళ్ళడం నా మనసెందుకో సహించలేకపోతోంది. నేను అటూ ఇటూ తిరిగాను. మొహం కడుక్కున్నాను. టిఫిన్ తిన్నాను. అయినా, నా కళ్ళు వనజ కోసమే చూస్తున్నాయి. పది నిముషాల తర్వాత మా మరో అన్నయ్య భార్య హైమవతి వచ్చి నన్ను చూసి, "ఇటు రా సుబ్బారావు" అంటూ నన్ను పక్కకు తీసుకువెళ్ళింది.

"ఏమిటి వదినా?"

"అబ్బీ, నా మెడలో మూడు పేటల చంద్రహారం కనబడ్డం లేదు. నిద్రపోయే ముందు ఉంది. బాగా గుర్తు. నా కాళ్ళూ చేతులూ అడ్డం లేదు. ఏం చేద్దాం" అంది బేలగా. అటుగా వదిన వచ్చింది. ఆ కబురు ఆవిడ చెవిన పడింది.

"అయ్యో" అంటూ వదిన అన్నయ్యని పిల్చింది. అందరం మొహామొహాలు చూసుకున్నాం. చిన్న వదినకు కళ్ళనీళ్ళ పర్యంతం అవుతోంది. వదిన నన్ను పక్కకు పిలిచి నెమ్మదిగా, "చూశావా, మరెవరు చేస్తారు? మన పద్మావతమ్మ పనే ఇది" అంది బాధగా.

"ఆవిడ మీద మన వనజను కాపలా పెట్టాను వదినా?"

"ఆవిడకి ఇలాంటి కావలాలు ఓ లెఖ్ఖా! చేయి తిరిగిన మనిషి - అంతా మన దురదృష్టం".

"పోనీ, నేను వెళ్ళి అత్తయ్యని నిలేయనా? ఊళ్ళోనే ఉందిగా?"

వదిన బాధతో తల కొట్టుకుని, "ఆవిడ ఒప్పుకుంటుందనా? నీ భ్రమ. పైగా నలుగురూ మనల్ని అంటారు. ఆడదానికి, అందునా అగర్భ శ్రీమంతురాలికి దొంగతనం అంటగడితే, కిట్టక చేశామంటారు."

అయినా, నేను వదిన మాట ఖాతరు చేయకుండా సత్యనారాయణపురం వెళ్ళాను. నేను వెళ్ళేసరికి పెళ్ళి జరుగుతోంది. అందరూ హడావిడిగా ఉన్నారు. జనాన్ని పరకాయించి చూస్తూంటే ఆడవాళ్ళ పక్కన ఓ మూలగా కుర్చీలో కూర్చుని కనిపించింది పద్మావతి అత్తయ్య మనిషి డీలాగా ఉంది.

"అత్తయ్యా" అంటూ దగ్గరగా వెళ్ళి పిలిచాను.

"నువ్వా, ఏమిటిలా వచ్చావ్" అంది అదోలా మొహం పెట్టి.

"నీతో మాట్లాడాలి, ఒకసారి బయటకు వస్తావా?"

ఇద్దరం బయటకు వచ్చాం. నేను జరిగింది చెప్పాను. అంతే, అత్తయ్య బావురుమంది. కన్నీళ్ళు జలజల రాలాయి.

"సుబ్బారావూ, ఏం చెప్పను? మన ఫంక్షన్ హాల్లోంచి హడావిడిగా లేచి వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చి చూసుకుంటే ఈ చేతి బంగారం గాజులు పన్నెండు - పన్నెండు కాసులు పెట్టి మొన్ననే చేయించుకున్నవి - లేవు. రాత్రి వరకూ ఉన్నాయి. ఆ అమ్మాయి ఎవరో వచ్చి పక్కన పడుకుంది. బహుశా ఈ పని ఆ పిల్లే చేసి ఉంటుంది. నేను లేచే సరికే ఆ పిల్ల లేదు. నా మతి మండా, అక్కడ చూసుకోలేదు నేను". చుట్టూ జనం తిరుగుతున్నారని కూడా చూడకుండా అత్తయ్య నిశ్శబ్దంగా రోదిస్తూనే ఉంది. మొహం కందగడ్డలా మారింది.

"హైమవతి చంద్రహారాలూ, నా గాజులూ కాజేసింది ఆ అమ్మాయే అయ్యుండాలి. అవును, గుర్తొస్తోంది సుబ్బారావ్ ఆ పిల్ల ప్రసాదం అంటూ మొరమొరాలు పెట్టింది

నాయనా! తిన్నాను. నాకు మత్తు వచ్చినట్టయ్యింది."

నాకు ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో తెలియడం లేదు. మనసు వికావికలమయి పోయింది. వనజ అలాంటి పని చేస్తుందంటే నమ్మకం కలగడం లేదు. ఆ అమ్మాయి కళ్ళు, ఆ కళ్ళలో నిజాయితీ. ఆమె మాటలు, ఆ మాటల్లోని స్వచ్ఛత - అన్నీ గుర్తు కొస్తున్నాయి. మంచి భవిష్యత్ ఉండి, గొప్ప ఉద్యోగం చేస్తున్న మనిషి ఇలాంటి పన్లకు పూనుకుంటుందా?

"ఆ అమ్మాయి అలాంటి పని చేస్తుందంటే.."

"కొందరు పైకి కనబడరు నాయనా, చేసేది చేసేస్తారు చల్లగా."

"సరేలే" అన్నాను, మరేమీ అనలేక నేను.

"ఇదిగో సుబ్బారావూ, నా గాజులు పోయిన సంగతి మీ అన్నయ్యా వదినా వాళ్ళకూ చెప్పకు. ఈ మాట ఆ నోటా ఈ నోటా వెళ్ళి మీ మావయ్య చెవిన పడ్డం నా కిష్టం లేదు. ఆయన నన్ను జీవితాంతం దెప్పుతూనే ఉంటాడు. సరేనా? నే వెడతాను" అంటూ పద్మావతి అత్తయ్య పమిట కొంగుతో కళ్లు ఒత్తుకుంది.

నేను వెనక్కి తిరిగాను. నా ఆలోచనలన్నీ గజిబిజిగా ఉన్నాయి. నిజంగా పద్మావతి అత్తయ్య గాజులు పోయాయా? తన మీదకు చిన్నాదిన చంద్రహారాల దొంగతనం రాకుండా ఇలా మాట్లాడుతోందా?? ఏదీ అర్థం కావడంలేదు. నిండా పాతిక సంవత్సరాలు లేని అవివాహిత, అందగత్తె, మంచి మాట నేర్పు ఉన్న వనజ కూడా క్లెప్టోమేనియాక్ అయ్యుం టుందని అనుకునేందుకు నా మనసు ఒప్పుకోవడం లేదు.

వనజ నాకు తిరిగి కనబడుతుందనీ, ఏదో ఒకనాడు మేం తారసపడతామనీ, అప్పుడే ఈ చిక్కుముడి విడివడుతుందీ ఊహించుకుంటే మనసు తేలిక పడ్డట్టయింది. కానీ... కానీ... ఒకవేళ నిజంగా వనజ అపరాధి అయితే? వనజ లాంటి పసిమొగ్గను పద్మావతి అత్తయ్యలా ఎదగకండా ఆదిలోనే ఆమెలోని లోపాన్ని తుడిచిపెట్టమనీ, ఆమె తన తప్పు తాను తెలుసుకునేటట్టు చేయమనీ, ఆమెను ఉత్తమ మార్గం వైపు మళ్ళించమనీ దేవుణ్ణి ప్రార్థించాను.

అయినా, నాకు మనసు ఆగింది కాదు. ఫంక్షన్ హాలుకు వెళ్ళిన తర్వాత వసంతను ఏకాంతంగా చూసి, వనజ అడ్రసు కోసం అడిగాను. వసంత నా వైపు అదోలా చూసి, "వనజకు ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ వారంలో అదక్కడ రిపోర్ట్ చెయ్యాలి. అది నాకు ఉత్తరం రాస్తేనే అడ్రసు తెలిసేది" అంది.

"అలానా?" అన్నాను నిస్పృహతో.

"ఆమె అడ్రసు అడుగుతున్నావ్ దేనికీ?"

నేను జవాబు ఇవ్వలేదు. ఎందుకో నాకు వనజ గురించి ఎవరికీ ఏమీ చెప్పకూడదని పించింది.

❖